# అపురూప వస్తువులు

అనుసృజన: **గౌరి సూర్యనారాయణ శర్మ**

**జరిగిన కథ : కాశీమజిలీ కథలను మధిర సుబ్బన్నదీక్షితులు పంతొమ్మిదో శతాబ్దిలో.. పన్నెండు సంపుటాలుగా రచించారు. మణిసిద్ధుడనే యతి కాశీయాత్ర చేస్తూ, తనకు సహాయకుడిగా వచ్చిన గోపాలకుడితో చెప్పినవే కాశీమజిలీలు. ప్రస్తుతం మీరు చదవబోయే కథ పదకొండో సంపుటంలోనిది.**

చించినీపురంలో భోజకుడనే ఉపాధ్యాయుడు ఉండేవాడు. ఆయనకు ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. వాళ్లకు పార్వతి, లక్ష్మి, సరస్వతి అన్న పేర్లు పెట్టుకున్నాడు. పెళ్లి వయసుకు చేరుకున్న తన కుమార్తెలకు భోజకుడు తొందరపడి.. సరిగా ముందువెనుక చరిత్రలు తెలుసుకోకుండానే హరి హర బ్రహ్మలనే ముగ్గురు అన్నదమ్ములకు ఇచ్చి పెళ్లిచేశాడు.

ఆ ముగ్గురు అన్నదమ్ములూ చదువుకున్నవాళ్లు కాదు. కానీ తాము పండితులమని మోసగించారు. తీరా పెళ్లిళ్లు అయిన తరువాత చేసేదేమీ లేక భోజకుడు ఊరుకున్నాడు. వాళ్లకు ఆస్తిపాస్తులు కూడా ఏమీలేవు. పోనీ పెళ్లి తరువాతైనా చదువు చెబుదామని ప్రయత్నిస్తే.. ఆ ప్రయత్నాలు కూడా విఫలమయ్యాయి.

కూతుళ్లకు తీవ్రమైన అన్యాయం చేశాననే దిగులుతోనే భోజకుడు మరణించాడు.

మామగారు మరణించినా హరి హర బ్రహ్మలు ఇంటి బాధ్యతను తీసుకోలేదు. పనిపాటలు చూసుకోలేదు. పైగా నిరంతరం జూదాలాడుతూ కాలక్షేపం చేయసాగారు. వాళ్ల వ్యసనం కారణంగా భోజకుడు కూడబెట్టిన ఆస్తంతా కరిగిపోయింది. చివరికి భార్యల నగలు కూడా తాకట్టుపెట్టి జూదమాడసాగారు.

ఇంత జరుగుతున్నా అక్కచెల్లెళ్లు ముగ్గురూ మౌనంగా భరించేవారు కానీ, భర్తలను నోరెత్తి ఒక్కమాట కూడా అనేవారు కాదు. పైగా వారు కోరిన వస్తువులన్నీ తెచ్చి ఇస్తుండేవారు. చూస్తుండగానే మగవారి జూద వ్యసనానికి ఆస్తిమొత్తం కరిగిపోయింది. భయంకరమైన దారిద్ర్యం ఆ కుటుంబాన్ని పట్టిపీడించసాగింది.

దారిద్ర్యానికి తోడుగా ఆ దేశానికి అనావృష్టి పరిస్థితులు కూడా తోడయ్యాయి. సూర్యుడు మృగశిరలో ప్రవేశించినా తొలకరి రాలేదు. ఆరుద్ర కార్తె, పునర్వసు కార్తెలు కూడా గడిచిపోయాయి కానీ చినుకు రాలలేదు. మబ్బులు పట్టిపట్టి గాలిచేత దూదిపింజలై చీలికలైపోతాయని.. వర్షం కురుస్తుందని కర్షకులు ఆశలు పెట్టుకుంటే, మేఘాలు ఒక్క నీటిబొట్టు రాల్చలేదు. వర్షకాలం నాలుగుమాసాలూ గడిచిపోయాయి. నదులు అడుగంటాయి. ఏటివంకల్లో ఇసుక మేటవేసింది. నేల నెర్రెలు వారింది. పొలాల్లో పచ్చదనం కరువైంది. పశువులకు మేత, నీరు దొరకట్లేదు. ఏ చెట్టుపిట్టలు ఆ చెట్టుమీదనే చనిపోసాగాయి. ధాన్యపు నిల్వలు అడుగంటిపోసాగాయి.

అటువంటి పరిస్థితుల్లో అక్కచెల్లెళ్లు ముగ్గురూ.. ఇతరుల ఇళ్లలో దాసీపని చేసుకుంటూ పొట్ట పోషించుకోసాగారు. వారిలో మధ్యయువతి లక్ష్మీదేవి భక్తురాలు. నిష్కామంగా, మానసికంగా దేవిని ఎల్లవేళలా ఆరాధిస్తూ ఉండేది. ఆమె భక్తివల్లనే ఆ కుటుంబం అంతోఇంతో మెరుగ్గా ఉండగలిగింది. అలా ఉండగా ఆమె గర్భవతి అయింది. కరవు తట్టుకోలేక, జూద వ్యసనాన్ని కొనసాగించే వీల్లేక అన్నదమ్ములు ముగ్గురూ తమ భార్యలను వాళ్ల కర్మానికి వదిలేసి, ఇంటినుంచి పారిపోయారు. గర్భవతి అయిన లక్ష్మిని మిగిలిన ఇద్దరూ కంటికిరెప్పలా కాపాడుకున్నారు. ఆమె క్రమంగా నెలలు నిండి చక్కని కొడుకును కన్నది.

అతనికి పుత్రకుడని పేరుపెట్టారు. ఆ పిల్లవాడు పుట్టింది మొదలు దేశంలో పరిస్థితులు చక్కబడ్డాయి. కానీ, ఆ ఇంటి పరిస్థితులు మాత్రం అలాగే ఉన్నాయి. పుత్రకుని తల్లి రాత్రీ పగలూ మహాలక్ష్మి ధ్యానంలోనే గడిపేది.

ఒకనాడు లక్ష్మి ప్రార్థన చేసి అలసిపోయి నిద్రించిన సమయంలో ఆమెకు స్వప్నంలో దేవీ దర్శనం కలిగింది.

''అమ్మాయీ! నేటినుంచి నీ కొడుక్కు పది సంవత్సరాలు వచ్చేవరకూ.. సూర్యోదయాన్నే నువ్వు నిద్రలేచే సమయానికి నీ కొడుకు తలదిక్కున మణుగు బంగారం ఉంటుంది. నీ కొడుకు గొప్ప కీర్తిమంతుడు కాగలడు'' అని ఆశీర్వదించింది దేవి.

ఆశ్చర్యపడుతూ నిద్రలేచేసరికి సూర్యోదయమైంది. స్వప్నంలో దేవి చెప్పినట్లే పుత్రకుని తల దిక్కున బంగారం కనిపించింది. దాంతో ఆ కుటుంబానికి దారిద్ర్యబాధ వదిలిపోయింది. అమ్మేసిన పొలాలు, స్థలాలు తాకట్టు విడిపించుకున్నారు. ప్రతిరోజూ లభించే బంగారంలో నాలుగోవంతు 'పుత్రక ముద్రికలనే' పేరుతో నాణేలు తయారు చేయించి దానధర్మాలు చేస్తుండేవారు.

పుత్రకునికి పద్దెనిమిదేళ్ల వయసు వచ్చింది. అతనికి చదువు అబ్బలేదు కానీ, సుగుణాలు అలవడ్డాయి. తమ గ్రామంలో పెద్దసత్రం కట్టించి నాలుగు వర్ణాలవారికీ భోజన సదుపాయం కల్పించాడు. ప్రజలందరూ పుత్రకుని దయాగుణాన్ని వేనోళ్ల పొగుడుతూ ఉండేవారు.

కొంతకాలానికి ఇల్లు వదిలి వెళ్లిన హరి హర బ్రహ్మలు తిరిగి వచ్చారు. తండ్రితోపాటుగా పెదతండ్రి, పినతండ్రి చాలాకాలానికి తిరిగి రావడం వల్ల పుత్రకుడు కూడా చాలా



